సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం ׀ 16 ׀ జూన్ ׀ 2023



సప్తవర్ణ శోభితం
అనంతగిరి: సూర్యాస్తమయ వేళ భానుడు సప్త వర్ణాలతో కనువిందు చేశాడు. ఈ దృశ్యాన్ని ప్రకృతి ప్రేమికులు ఆసక్తిగా తిలకించారు.



ఆర్‌బీకేల్లో వరి విత్తనాలు
రాజవొమ్మంగి మండలకేంద్రంలోని రైతు భరోసా కేంద్రాలకు గురువారం ఖరీఫ్ వరి విత్తనాలు చేరాయి. 8లో



నేటి నుంచి ఆఈట్ కౌన్సెలింగ్
ఏయూ సెల్ఫ్ సపోర్ట్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు రెండో దశ కౌన్సెలింగ్ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. 8లో

న్యూస్‌రీల్

ఆలోచన శక్తి పెంచేలా కృషి
- ఇన్‌చార్జి డీఈవో అప్పలనాయుడు



విద్యార్థుల నమూనాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీఈవో అప్పలనాయుడు, ఇతర ఉపాధ్యాయులు

సాక్షి,పాడేరు: విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనతో పాటు ఆలోచన శక్తిని పెంచేందుకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని ఇన్‌చార్జి డీఈవో అప్పలనాయుడు కోరారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమగ్రశిక్ష విభాగం జన్‌భగిదరిపై ఎఫ్ఎల్ఎన్ ప్రదర్శన ఏర్పాటుచేశారు. పలు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వీటిని ఇన్‌చార్జి డీఈవోతోపాటు సమగ్ర శిక్ష ఏఎంవో భాస్కరావు, డీసీడీవో సూర్యకుమారి, ఇతర ఉపాధ్యాయులు పరిశీలించారు. వారిని అభినందించారు.

ఏకలవ్యలో ప్రవేశాలు ప్రారంభం



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

రాజవొమ్మంగి: రంపచోడవరం, చింతూరు డివిజన్లలోని ఆరు ఏకలవ్య పాఠశాలల్లో గురువారం ప్రారంభమైన మొదటి విడత కౌన్సెలింగ్‌లో దాదాపు 200 మంది చిన్నారులు ఆరవ తరగతిలో ప్రవేశం పొందారు. ఏకలవ్య పాఠశాలల్లో (ఈఎంఆర్ఎస్) ప్రవేశానికి ఏప్రిల్ 30న ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. దాదాపు 2వేల మంది హాజరుకాగా 365 మంది అర్హులుగా ప్రకటించారు. కాగా మొదటి రోజు 200 మంది పాఠశాలల్లో చేరినట్లు రంపచోడవరం ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపాల్ (కన్వీనర్) ఎంవీ రమణ తెలిపారు. శనివారం మొదట విడత కౌన్సెలింగ్ పూర్తవుతుందని, ఇంతవరకు జాయినింగ్ పొందని వారి కోసం, బ్యాక్ లాగ్ సీట్లు భర్తీకి ఈ నెల 17వ తేదీన రెండ విడత కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. ప్రవేశపరీక్షల్లో అర్హత సాధించిన వారంతా వచ్చి ఏకలవ్య పాఠశాలల్లో చేరాలని సూచించారు.

ముగిసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు



క్రీడాసామగ్రి, మెరిట్ పత్రాలను అందజేస్తున్న చేస్తున్న ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, క్రీడా విభాగం అధికారులు

సాక్షి,పాడేరు: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు గురువారంతో ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 50చోట్ల నిర్వహించిన ఈ శిబిరాలలో పాల్గొన్న ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులకు క్రీడా సామగ్రి, మెరిట్ పత్రాలను ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ అందజేశారు. వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను విజయవంతంగా నిర్వహించిన అందరికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీడీవో జగన్మోహన్‌రావు, ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి డి.సూరిబాబు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జన భాగీదారీ ర్యాలీలు



గుత్తులపుట్టులో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

సాక్షి,పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా జన భాగీదారీ ర్యాలీలను ఐసీడీఎస్ ఉత్సాహంగా నిర్వహిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరేళ్ల లోపు చిన్నారులకు అందిస్తున్న నాణ్యమైన పౌష్టికాహారం, ఆట పాటలతో కూడిన ప్రాథమిక విద్య కార్యక్రమాలపై గ్రామాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించే లక్ష్యంతో వీటిని నిర్వహిస్తున్నారు. గుత్తులపుట్టు అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో చిన్నారులు, తల్లులు, అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉర్మిళ గురువారం ర్యాలీ నిర్వహించారు.

సీఎం ఆత్మీయ పలకరింపుతో
మురిసిన గిరిజనం
వర్చువల్ విధానంలో 85 సెల్ టవర్లను ప్రారంభించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, పాడేరు/హుకుంపేట/జి.మాడుగుల: అన్నా బాగున్నావా.. అమ్మా బాగున్నావా..అంటూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆత్మీయ పలకరింపుతో గిరిజనులు మురిసిపోయారు. జిల్లాలోని జియో సంస్థకు చెందిన 85 సెల్‌టవర్లను గురువారం సీఎం జగన్‌మోహన్ రెడ్డి వర్చువల్ విధానంతో తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. అరకులోయ నియోజకవర్గం హుకుంపేట మండలం మారుమూల భీమవరం, పాడేరు నియోజకవర్గం జి.మాడుగుల మండలం మారుమూల సుబ్బులులో జియో కంపెనీకి చెందిన సెల్‌టవర్లను ఆయన ప్రారంభించడంతో స్థానిక గిరిజనులు ఆనందానికి గురయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ వీడియో సమావేశంలో ప్రజాప్రతినిధులను సొంత కుటుంబ సభ్యుల మాదిరిగానే ఎంతో ఆత్మీయంగా పలకరించారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణను 'పాల్గుణ అన్నా' బాగున్నావా..అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిలను అమ్మ బాగున్నావా అంటూ మాట్లాడారు. వారు కూడా 'అన్నా బాగున్నాము' అంటూ హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. సీఎం ఆశ కార్యకర్త, వరలక్ష్మి హార్టికల్చర్ అసిస్టెంట్ శాంతికుమారితో మాట్లాడారు.



సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుహిన్ సిన్హా అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, సతక బుల్లిబాబు

డిసెంబర్ నాటికి పూర్తి చేయండి : సీఎం జగన్ ఆదేశం



ఈ ఏడాది డిసెంబర్ నాటికి జిల్లాలోని 2,265 సెల్ టవర్లను పూర్తిచేయాలని భీమవరంలో ప్రారంభ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన సెల్‌టవర్ల నిర్మాణాల వివరాలను సీఎంకు కలెక్టర్ సమగ్రంగా వివరించారు. సెల్ టవర్ల నిర్మాణాలతో నాణ్యమైన పౌర సేవలను త్వరితగతిన అందించేలా సౌకర్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. గ్రామ సచివాలయాల్లో 540 రకాల సేవలు అందించేందుకు నెట్‌వర్క్ దోహదపడుతుందని కలెక్టర్ వివరించారు. జిల్లాలోని అన్ని గ్రామాలకు సెల్ సౌకర్యం అందుబాటులో తేవాలని సీఎం ఆదేశించారు. సమాచార వ్యవస్థ ప్రజలకు పాలనను మరింత చేరువ చేస్తుందని ఈ దిశగా చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. గిరిజన ప్రాంతాల్లో 4జి సేవలను అందుబాటులోకి తెస్తున్నామని ఆయన వివరించారు.

అభివృద్ధిలో దూసుకుపోతున్న ఏజెన్సీ: అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



ఏజెన్సీ అభివృద్ధిలో దూసుకుపోతోందని, సెల్ టవర్ల నిర్మాణంతో గిరిజనుల సమస్య చాలా వరకు తీరిందని ఎమ్మెల్యే సీఎంకు వివరించారు. రూ.680 కోట్లతో 317రోడ్లు నిర్మించామని, జామిగూడ, ఇంజరి వంటి మారుమూల గ్రామాలకు రోడ్ల సౌకర్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. 108, 104 సేవలకు కూడా పూర్తిస్థాయిలో గిరిజనులు సద్వినియోగం చేసుకునే అవకాశం ఏర్పడిందన్నారు. మన బడి నాడు-నేడులో విద్యాలయాలు దేవాలయాల మాదిరిగా అభివృద్ధి చేశారన్నారు. గత చంద్రబాబు ప్రభుత్వం జారీ చేసిన బాక్సైట్ అనుకూల జీవోలను రద్దు చేసి గిరిజనుల పక్షపాతిగా నిలిచారని, మేమంతా రుణపడి ఉంటామని తెలిపారు.

గిరిజనుల తరఫున రుణపడి ఉంటాం: పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

పాడేరు డివిజన్ పరిధిలో గిరిజనులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో 1.25 లక్షల మంది గిరిజన రైతులకు 2.50ఎకరాలకు అటవీ హక్కు పత్రాలను పంపిణీ జరిగిందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి వివరించారు. గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రూ.500 కోట్లతో వైద్య కళాశాల నిర్మిస్తున్నందున మీకు తామెంతో రుణపడి ఉంటామని ఆమె పేర్కొన్నారు. సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడే వారికి రూ.10వేలు పింఛను అందించడం వల్ల వారికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. మిషన్ కనెక్టు పాడేరులో రూ.57కోట్లతో ఉపాధిహామీ పథకంలో రోడ్లు మంజూరు చేసినందుకు ఆమె సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ సమాచార విప్లవం ప్రారంభమయిందని న్నారు. జి.మాడుగుల మండలంలో కిల్లంకోట పంచాయతీ సుబ్బులు అత్యంత మారుమూల గ్రామమని తెలిపారు. ఒడిశా రాష్ట్రానికి 10 కిలోమీటరు,, పాడేరుకు 50కిలోమీటర్లు దూరంలో ఈ గ్రామం ఉందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తుహిన్ సిన్హా, పాడేరు ఏఎస్పీ ధీరజ్, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, హుకుంపేట ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, ఎంపీడీవో వెంకటరావు, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, సీడీపీవో బాలచంద్రమణి సేవి, సర్పంచ్ నైని సన్నిబాబు, ఎంపీటీసీ నైని రజని, సర్పంచ్‌లు ఈశ్వరి, లక్ష్మయ్య, జీకే వీధి జెడ్పీటీసీ మత్స్యరాస శివరత్నం, ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు,ఎంపీడీవో చంద్రశేఖరరావు, తహసీల్దార్ అప్పలస్వామి, టీడబ్ల్యూవో తిరుపాల్, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు ఎంపీటీసీలు మత్స్యరాస విజయకుమారి, గబ్బాడి సన్యాసిదొర, అప్పలరాజు, సర్పంచ్‌లు కిముడు రాంబాబు,లసంగి మాలన్న, చెల్లమ్మ పాల్గొన్నారు.



సుబ్బులులో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, చిత్రంలో ఐటీడీఏ పీవో అభిషేక్



సెల్ టవర్ ప్రారంభ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

జగనన్నా బాగున్నారా



ఆశా కార్యకర్త వరలక్ష్మి : నమస్తే జగనన్నా..! బాగున్నారా అన్నా..!!
సీఎం జగన్ : బాగున్నా.... థ్యాంక్యూ తల్లీ

వరలక్ష్మి: నా పేరు పొత్తూరు వరలక్ష్మి, కిల్లంకోట పంచాయతీ, మారుమూల సుబ్బులు గ్రామం. ఈ రోజు మీతో నేరుగా మాట్లాడుతున్నంటే మీ ఇచ్చిన టవర్ వల్ల సాధ్యమైంది. ఇది నాకు ఆనందంగా ఉందన్నా. అన్నా గతంలో మాకు రోడ్డు సౌకర్యంలేదన్నా, అలాగే కరెంట్ సౌకర్యం లేదన్నా, టవర్ సౌకర్యం లేదన్నా, మీరు సీఎంగా వచ్చి మాకు టవర్, కరెంట్, మండలం నుంచి 25 కిలోమీటర్లు రోడ్డు సౌకర్యం కల్పించారన్న, ఇది మా గ్రామస్తులందరు చాలా ఆనందపడుతున్నామన్నా. అదేఅన్నా.. గత కాలంలో అయితే గర్భవతులుగాని, ఎమర్జెన్సీలో ఉన్నవారిని ఆస్పత్రికి తీసుకెళ్లలంటే డోలీలో 25కిలోమీటర్లు దూరం కాలినడకన వెళ్లి ఆస్పత్రికి చేర్చేవాలం అన్నా. మా శ్రమను గుర్తించి ఈ రోజు మాకు ఇంటి నుంచే 108 వాహనానికి ఫోన్ చేసి పేషెంట్లను, గర్భవతుల డెలివరీ కేసులను తీసుకెళ్లే అవకాశాన్ని కల్పించారన్నా. ఎప్పుడూ మీకు రుణపడి ఉంటామన్నా... ఇప్పుడు మీరు పెట్టిన సంక్షేమ పథకాల్లో మా కుటుంబానికి మూడు పథకాలు అందుతున్నాయన్నా. ఒకటి.అత్తమ్మకు పింఛను రూ.2750 అందుతుందన్నా, రెండు..నా భర్తకు రైతు భరోసాగా రూ.13,500, మూడు..మా కూమార్తెకు అమ్మఒడి పథకం రూ.15వేలు అందుతున్నాయాన్నా...గత కాలంలో అయితే ఇలాంటి అవకాశం లేదు..మేము చాలా ఇబ్బందులు పడేవారమన్నా....ఇది చాలా మాకు ఆనందంగా అన్నా... మీరే మళ్లీ సీఎంగా రావాలన్న మీరే కావాలన్నా... ఈ అవకాశమిచ్చిన మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు అన్నా అని పేర్కొంది.

సీఎం జగన్ : థ్యాంక్యూ తల్లి వరలక్ష్మమ్మ.. చాలా చక్కగా మాట్లాడావు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు
- డిప్యూటీ డీఈవో చెల్లయ్య
- టాపర్లకు ప్రభుత్వ ప్రోత్సాహం పంపిణీ

అరకులోయ రూరల్: విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డిప్యూటీ డీఈవో చెల్లయ్య అన్నారు: గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయిలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. టెన్త్, ఇంటర్ ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందించారు. టెన్త్ టాపర్లుగా ప్రథమ స్థానంలో నిలిచిన సీతగుంట ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలకు చెందిన పి.సుహాసినికి రూ.15వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన యండపల్లివలస గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని దీప్తినాయనకు రూ.10వేలు, తృతీయ స్థానంలో నిలిచిన గుమకోట గురుకుల విద్యార్థి భాస్కర్‌కు రూ.5 వేలు, నాల్గో స్థానం సాధించిన ముంచంగిపుట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి నవీనీత్‌కు రూ.5 వేలు అందజేశారు. ఇంటర్‌లో టాపర్లుగా నిలిచిన పెదబయలు గురుకుల విద్యార్థి జి.గోపాల్, యండపల్లివలస గురుకుల కళాశాల విద్యార్థి ఎస్.ఇంద్ర, అరకులోయ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి వి.ముకేష్‌కుమార్, అరకు గురుకుల కళాశాలకు చెందిన విజయ్‌కు డిప్యూటీ డీఈవో, గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు, జెడ్పీటీసీ శెట్టి రోషిణి రూ.15 వేల చొప్పున నగదు, మెడళ్లు, ధ్రువపత్రాలు అందజేశారు. ఎంపీటీసీలు భీమరాజు, ఆనంద్‌కుమార్, సర్పంచ్ దాసుబాబు, ఎంఈవో భారతిరత్నం, హెచ్‌ఎంలు బాలాజీ, దయానిధి, సత్యనారయణ, గోపాల్, సీఆర్పీలు రమేష్, మాణిక్యమ్మ, వాసు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, అధికారులు

గ్రామసభలతో సమస్యల పరిష్కారం
- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీపతి

చింతూరు: పోలవరం నిర్వాసితులకు ఎలాంటి సమస్యలున్నా వాటిని గ్రామసభల ద్వారా పరిష్కరించుకునే అవకాశముందని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీపతి అన్నారు. పోలవరం ప్రాజెక్టు ముంపులో భాగంగా ప్రాధాన్యతా క్రమంలో చేర్చిన చింతూరు మండలం మల్లెతోటలో గురువారం ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వలంటీర్లు నిర్వహించిన సామాజిక, ఆర్థిక గణన సర్వేలో పొరపాట్లు ఉన్నా, ఏమైనా మార్పులు, చేర్పులు చేయాల్సి ఉన్నా తమకు దరఖాస్తులు అందచేస్తే వాటిని సరి చేస్తామని తెలిపారు. తహసీల్దార్ కారం సుబ్బారావు, ఎంపీడీవో వెంకటరత్నం మాట్లాడుతూ ప్రతీ నిర్వాసితుడికి న్యాయం చేయాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందరికీ పరిహారంతో పాటు పునరావసం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రానున్న వరదలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే నిత్యావసరాలు నిల్వ చేయడం జరిగిందని, గ్రామ వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది వరదల సమయంలో తోడుగా ఉండి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సాయపడతారని వారు తెలిపారు. గ్రామసభ సందర్భంగా గ్రామంలోని కుటుంబాలకు సంబంధించిన వివరాలను వలంటీర్ల ద్వారా వెల్లడి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు జల్లి లావణ్య, సర్పంచ్ అగరం సుబ్బలక్ష్మి, కార్యదర్శి విశ్వాస్, ఆర్ఐ దారయ్య పాల్గొన్నారు.

త్వరలో ఇళ్ల సర్వే..

కూనవరం: మండల పరిధిలోని కూళ్లపడు, వాల్ఫర్డ్ పేట, లేళ్లవాయి ముంపు గ్రామాలను పోలవరం ప్రాజెక్ట ప్రాధాన్యత గ్రామాల్లో చేర్చిన నేపథ్యంలో గ్రామసభలు నిర్వహిస్తున్నామని పోలవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(భూ,సే) సుబ్బారావు తెలిపారు. మండలంలోని కూళ్లపాడులో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. త్వరలో ఇళ్ల సర్వే చేపడతామన్నారు. ఇంటి యజమానులు పేర్లు నమోదు, అకౌంట్ల వివరాలు, మృతుల వివరాల్లో పొరపాట్లు ఉంటే సరిచేసుకోవాలని ఆయన సూచించారు. గిరిజనులకు ఎటపాక మండలంలో పునరావాస కాలనీలు నిర్మిస్తామని తెలిపారు. మొత్తం 132 కుటుంబాలకు సంబంధించి జాబితాలో పేర్లను వినిపించారు. తహసీల్దార్ కె.అనసూయ, సర్పంచ్ సోందె ముత్తమ్మ, కార్యదర్శి సురేష్, వీఆర్వో సుగుణ, సోందె పాపారావు పాల్గొన్నారు.



మల్లెతోటలో జరిగిన గ్రామసభలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీపతి



కూళ్లపాడు గ్రామసభలో నిర్వాసితుల పేర్లు చదువుతున్న అధికారి

ఇంటికి చేరుకోవాల్సిన కాసేపటికే..







సంఘటన స్థలంలో కాకూరి ముత్యాలమ్మ, కె.ముత్యాలమ్మ, గొల్లూరి లైసన్ మృతదేహాలు

- వ్యాన్ బోల్తా పడి ముగ్గురి మృతి
- 20 మందికి గాయాలు
- నలుగురి పరిస్థితి విషమం

కొయ్యూరు: విధి వక్రించింది. మరి కొద్ది నిమిషాల్లో ఇంటికి చేరుకోవాల్సిన వారిని మృత్యువు దారికాసి కబళించింది.పోతవరం నుంచి ఎం.భీమవరం వస్తున్న వ్యాన్ గురువారం సాయంత్రం బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు సంఘటన స్థలంలోనే మృతి చెందారు. 20 మంది గాయపడ్డారు. వీరిని మారేడుమిల్లి మండలంలోని బోదులూరు ఆస్పత్రికి తరలించారు.

అక్కడి నుంచి రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. క్షతగాత్రుల్లో విషమంగా ఉన్న వంతల లక్ష్మి, పల్లల బుచ్చెమ్మ, కడబాల చిలకమ్మ, గొలిసింగి అబ్బాయిని రాజమండ్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుల్లో ఎం.భీమవరం పంచాయతీ చీడికోటకు చెందిన కాకూరి ముత్యాలమ్మ (50), డబ్బకోటకు చెందిన గొల్లూరి లైసన్ (45)తో పాటు గుర్తేడు నుంచి ఎం.భీమవరంలోని బంధువుల ఇంటికి వస్తున్న కె.ముత్యాలమ్మ (40) కూడా ఉన్నట్టు స్థానికులు తెలిపారు. ప్రతీ గురువారం పోతవరంలో సంత జరుగుతుంది. ఎక్కువ మంది ఈ సంతకు వెళ్తారు. ఇలా వెళ్లిన వారు పోతవరం నుంచి ఎం. భీమవరం వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ గ్రామానికి కిలోమీటరు ముందు రెండు ఇరుకైన మలుపుల వద్ద వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. ముగ్గురు సంఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు.

సంఘటన స్థలం మంప పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్నా ఇక్కడకు దూరం కావడంతో గుర్తేడు పోలీసులు సంఘటన స్థలానికి వచ్చారు. సహాయక చర్యలు చేపట్టారు. అత్యవసర వైద్యం అందేలా ఏర్పాట్లు చేశారు.








వ్యాన్ బోల్తా ఘటనలో క్షతగాత్రులు

ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లపై దృష్టి
- అనుమతులున్న విద్యాసంస్థల్లో విద్యార్థులు చేరాలి
- ప్రైవేటు కాలేజీల్లో తనిఖీలు కొనసాగుతాయి
- ఆన్‌లైన్ విధానంలోనే ఇంటర్ అడ్మిషన్లు
- 'సాక్షి'తో ఆర్ఐవో సత్యనారాయణ



విశాఖ విద్య: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఈ ఏడాది అడ్మిషన్లు పెరిగేలా ప్రత్యేక ఫోకస్ పెట్టామని ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి(ఆర్ఐవో) రాయల సత్యనారాయణ అన్నారు. గురువారం ఆయన 'సాక్షి' తో మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ కాలేజీల నిర్వహణ, ప్రైవేటు కాలేజీల అనుమతుల విషయంలో తీసుకుంటున్న చర్యలపై వివరించారు. ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్లు పెంచేలా ప్రిన్సిపాళ్లు బాధ్యత తీసుకోవాలన్నారు. ఇంటర్మీడియెట్ ప్రవేశాలు తప్పనిసరిగా ఆన్‌లైన్ విధానంలోనే చేపట్టాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మాత్రమే ఆన్‌లైన్ ప్రవేశాలు జరుగుతున్నాయన్నారు. పూర్తి స్థాయిలో అనుమతులు వచ్చిన తరువాతనే ప్రైవేటు కాలేజీల్లో అడ్మిషన్లు చేపట్టాలన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. ప్రైవేటు కాలేజీల్లో అడ్మిషన్ తీసుకునే సమయంలో తప్పనిసరిగా ఆ కాలేజీకి ప్రభుత్వ గుర్తింపు ఉందా..? లేదా అనేది పరిశీలన చేయాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేటు కాలేజీల నిర్వహణకు అనుమతి ఇచ్చే క్రమంలో తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయన్నారు. జిల్లా కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఆదేశాలకు అనుగుణంగా ఈ విషయంలో ముందుకెళ్తామన్నారు. నిబంధనలు అతిక్రమించే ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే కాలేజీ గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించారు.

882 కిలోల నిషేధిత ప్లాస్టిక్ స్వాధీనం
- 5,694 దుకాణాలకు
- రూ.3,43,070 జరిమానా

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాలతో జీవీఎంసీ ఉన్నతాధికారుల నుంచి వార్డు సచివాలయ కార్యదర్శుల వరకు గురువారం నిషేధిత ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు నేతృత్వంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం పెద్ద ఎత్తున దాడులు జరిపింది. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ జీవీఎంసీ 8 జోన్లలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి.. 5,964 దుకాణాల నుంచి 882.7 కిలోల నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దుకాణ యజమానుల నుంచి రూ.3,43,070 అపరాధ రుసుం కింద వసూలు చేసినట్లు వెల్లడించారు. నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తూ మూడు సార్లు వరకు పట్టుబడితే జరిమానా వేస్తామని, ఆ తర్వాత పట్టుబడితే దుకాణానికి తాళం వేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న సీఐ అశోక్‌కుమార్, సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ సహాయ కమాండెంట్ మేఘన

గూడెంకొత్తవీధి: రక్తదానం చేయడంతో ఆపదలో ఉన్న వారికి ప్రాణాలు నిలిపే వారమవుతామని గూడెం కొత్తవీధి సీఐ అశోక్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని రెడ్‌క్రాస ఆధ్వర్యంలో స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్‌పీ కానిస్టేబుళ్లతో పాటు స్థానికులు, యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. సీఐ అశోక్‌కుమార్‌తో పాటు సీఆర్‌పీఎఫ్–234 బెటాలియన్ సహాయ కమాండెంట్ మేఘన శిబిరానికి వచ్చి రక్తదానం చేశారు. శిబిరంలో మధ్యాహ్నానికి 53 యూనిట్ల రక్తాన్ని దాతల నుంచి సేకరించినట్టు నిర్వాహకులు తెలిపారు. ఎస్‌ఐ అప్పలసూరి, హెచ్‌సీ వాసు, సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్‌పీ, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

మోతుగూడెం: చింతూరు మండలం లక్కవరం గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి అనే మహిళ అక్రమంగా మద్యం అమ్మకాలు చేయడంతో పోలీసులు పట్టుకున్నారు. చింతూరు ఎస్‌ఐ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గ్రామంలో దాడులు చేశామని ఏఎస్‌ఐ పట్టాభిరామ్ చెప్పారు. ఈ నేపథ్యంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వెంకటలక్ష్మి నుంచి 32 క్వార్టర్ సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అక్రమంగా మద్యం నిల్వ చేసినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుళ్లు సత్తిబాబు, సన్నీ ఏఆర్ సిబ్బంది ఉన్నారు. స్వాధీనం చేసుకున్న మద్యాన్ని సీజ్ చేసి నిందితురాలిని రంపచోడవరం కోర్టుకు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

జాతీయ స్థాయి ఎన్‌సీసీ క్యాంపునకు విద్యార్థులు





ఎంపికైన విద్యార్థులు ముకేష్, వీరేంద్ర

పాయకరావుపేట: శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో 9వ తరగతి చదువుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు ఎన్.వి.ఎం.ఎస్.ముకేష్, బి.మధు వీరేంద్ర గుంటూరులో జరిగే ఆలిండియా ఏక్ భారత్–స్వచ్ఛ భారత్ 2 శిబిరానికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు బి.సీతారాణి తెలిపారు. వీరు ఈనెల 15 నుంచి 26 వరకు గుంటూరులో జరిగే అంతర్ రాష్ట్ర శిబిరంలో పాల్గొంటారన్నారు. వీరికి శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అధినేత సిహెచ్.వి.కె.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్.మూర్తి, బోధన, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

ఉన్నత విద్యతో ఉజ్వల భవిత



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు మహేష్‌బాబు, సంధ్యారాణిలకు నగదు బహుమతి అందజేస్తున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



రాజవొమ్మంగిలో అవార్డు గ్రహీత చరణ్‌తేజతో పాటు విద్యార్థి తల్లిదండ్రులు, పాఠశాల హెచ్‌ఎం సూరారెడ్డి

- ఘనంగా 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం
- పది, ఇంటర్ ర్యాంకర్లకు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలు అందజేసిన ఐటీడీఏ పీఓ సూరజ్ గనోరే

రంపచోడవరం: ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిత ఉంటుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే అన్నారు. మండల కేంద్రంలోని ఇర్లపల్లి బాలికల ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో మంగళవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పదవ తరగతి. ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి. సర్టిఫికెట్. విద్యార్థుల తల్లిదండ్రులకు, సంబంధిత ప్రధానోపాధ్యాయులకు శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే మాట్లాడుతూ ఏజెన్సీలో విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అభ్యసించాలన్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని అందుకు అనుగుణంగా కష్టపడితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలోని నియోజకవర్గంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన కూనవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని పోసిన జాహ్నవి ప్రథమ బహుమతి కింద రూ.15వేలు, రెండో బహుమతి దేవీపట్నం మండలం ఇందుకూరుపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థి కుంచే మహేష్‌బాబుకు రూ.10వేలు, మూడో బహుమతి రాజవొమ్మంగి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి మిరియాల చరణ్‌తేజ్‌కు రూ.5వేల నగదు బహుమతిని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అందజేశారు. ఇంటర్మీడియట్‌కు సంబంధించి దేవీపట్నం ప్రభుత్వ జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థిని చింతల వీర సూర్యదేవి (సీఈసీ), చింతల వీర వెంకటలక్ష్మి (హెచ్‌ఈసీ), కూనవరం ఏపీటీడబ్ల్యూఆర్ స్కూల్, కాలేజీకి చెందిన ప్రమీలరాణి (బైపీసీ), వై.రామవరం ఏపీటీడబ్ల్యూఆర్ స్కూల్, కాలేజీకి చెందిన కోసూరి సంధ్యారాణి(ఎంపీసీ)లకు ప్రథమ బహుమతి కింద ఒక్కొక్కరికి రూ.10వేలను అందజేశారు. ఆయా విద్యార్థుల తల్లిదండ్రులు, హెచ్‌ఎంలను ఘనంగా సత్కరించారు.

విద్యాభివృద్ధికి ప్రాధాన్యం

ఈ సందర్భంగా ఎంపీపీ బందం శ్రీదేవి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం ద్వారా విద్యార్థులను ప్రోత్సహించేందు నగదు ప్రోత్సాహకాలు అందజేయడం హర్షణీయమన్నారు. అవార్డు పొందిన విద్యార్థులు ఇంకా బాగా చదివి ఉన్నత హోదాల్లో నిలవాలని ఆకాంక్షించారు. జెడ్పీటీసీ సభ్యురాలు పందా వెంకటలక్ష్మి మాట్లాడుతూ ర్యాంకర్లను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులందరూ బాగా చదవాలని, ప్రభుత్వ పథకాలను, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైస్ ఎంపీపీ బొమ్మిశెట్టి బాలకృష్ణ, ఏజెన్సీ డీఈవో ఎం.మల్లేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు వంశీ, సర్పంచ్ కుంజం లక్ష్మి, ఎంఈవో ఎం.వి.వి.సత్యనారాయణ దొర, సూరిబాబు, హెచ్‌ఎం ముత్యాలరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: రంపచోడవరంలో జరిగిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో నగదు బహుమతి పొందిన రాజవొమ్మంగి జెడ్పీ పాఠశాల విద్యార్థి మిరియాల చరణ్ తేజ్, అతడి తల్లిదండ్రులు, హెచ్‌ఎం టి.సూరారెడ్డికి గురువారం స్థానికులు అభినందనలు తెలిపారు.

ఆర్‌బీకేల్లో వరి విత్తనాలు

రాజవొమ్మంగి: మండలకేంద్రంలోని ఆర్బీకేకు గురువారం ఖరీఫ్ వరి విత్తనాలు చేరాయి. కేంద్రానికి ఇప్పటివరకు ఎంటీయూ–1064 రకం 767 బ్యాగులు, ఎంటీయూ–1121 రకం 67 బ్యాగులు అందుబాటులో ఉన్నట్టు ఏవో రమేష్‌నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి, రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో విత్తనాలు ఆర్బీకేలకు చేరతాయన్నారు. ఇప్పటి వరకు బడదనాంపల్లి, దూసరపాము, రాజవొమ్మంగి, కింద్ర, లబ్బర్తి, జడ్డంగి, కొమరాపురం స్టాక్ పాయింట్లకు విత్తనాల సరఫరా పూర్తి చేసినట్టు చెప్పారు.శరభవరం ఆర్బీకేకు ఇంకా విత్తనాలు రావాల్సి ఉందన్నారు. విత్తనాల మొలక శాతం పరిశీలించి , రైతులకు 90 సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ ప్రారంభిస్తామన్నారు. మండలంలోని రైతులకు ఈ ఏడాది 90 శాతం సబ్సిడీపై 1200 క్వింటాళ్ల ఎంటీయూ–1064, 1121, 1318, ఎన్‌ఎల్‌ఆర్ (నెల్లూరి సన్నాలు) వరి విత్తనాలను అందజేయాలన్నది లక్ష్యం అని ఏఓ రమేష్ నాయుడు అన్నారు. ఇప్పటి వరకు మండలానికి 1000 క్వింటాళ్ల విత్తనాలు చేరాయన్నారు.

నేటి నుంచి ఆఈట్ కౌన్సెలింగ్

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సెల్ఫ్ సపోర్ట్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు రెండో దశ కౌన్సెలింగ్ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ర్యాంకర్లు తమ సర్టిఫికెట్లను ఈ నెల 19వ తేదీ వరకు అప్‌లోడ్ చేయాలని ప్రవేశాల సంచాలకులు ఆచార్య డి.ఎ.నాయుడు తెలిపారు. ఈ నెల 21 నుంచి 25 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని, ఈ నెల 27న సీట్ల కేటాయింపు చేయనున్నట్లు పేర్కొన్నారు. సీట్లు పొందిన వారు ఈ నెల 28 నుంచి జూలై 1వ తేదీ వరకు ఫీజు చెల్లించాలన్నారు.

డాక్టర్ నరసింగరావుకు మాతృవియోగం



అమ్మన్న (ఫైల్)



ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, నరసింగరావును పరామర్శిస్తున్న అరకు ఎంపీ మాధవి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర తదితరులు

ముంచంగిపుట్టు: ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ తమర్భ నరసింగరావు మాతృమూర్తి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అత్తగారు అయిన తమర్భ అమ్మన్న(91) కన్నుమూశారు.గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న అమ్మన్న పెదగూడ పంచాయతీ కేంద్రంలో వారి ఇంటి వద్ద గురువారం ఉదయం మృతి చెందారు. అమ్మన్న భౌతిక దేహాన్ని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్రలు సందర్శించి, పూలమాలలతో నివాళులర్పించారు. నరసింగరావు, భాగ్యలక్ష్మిలను వారు కలిసి ఓదార్చరు.

ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అరకు, రంపచోడవరం ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మీ, జీసీసీ చైర్ పర్సన్ శోభ స్వాతిరాణి, ట్రైకార్ చైర్మన్ సతకం బుల్లిబాబు, రంపచోడవరం ఎమ్మెల్సీ అనంతబాబు, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు మత్స్యరాస వెంకటలక్ష్మితో పాటు పలువురు ప్రముఖులు, రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయి నేతలు ఫోన్‌లో నరసింగరావు, భాగ్యలక్ష్మిలను పరామర్శించి, సంతాపం వ్యక్తం చేశారు.అమ్మన్న అంతిమ సంస్కరణ శుక్రవారం ఉదయం 11 గంటలకు పెదగూడ గ్రామంలో నిర్వహిస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలియజేశారు.

మొబైల్ లోకేషన్‌తో కేసును ఛేదించిన పోలీసులు

- రూ.8.5 లక్షల సొత్తు రికవరీ
- కేసు వివరాలు వెల్లడించిన రూరల్ సీఐ రమణయ్య



స్వాధీనం చేసుకున్న రికవరీ సొత్తుతో సీఐ రమణయ్య, ఎస్సై లక్ష్మీనారాయణ, సిబ్బంది

నర్సీపట్నం : మొబైల్ లోకేషన్‌తో దొంగతనాన్ని పోలీసులు ఛేదించారు. సాంకేతిక పరిజ్ఞానంతో నాతవరం పోలీసులు దొంగతనానికి పాల్పడిన నిందితులను చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ కేసులో రూ.8.5 లక్షల విలువ గల సొత్తు రికవరీ చేసి, నలుగురు వ్యక్తులను అరెస్టు చేశామని రూరల్ సీఐ రమణయ్య తెలిపారు. గురువారం నర్సీపట్నం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానంతో కేసును ఛేదించగలిగామన్నారు. కంపెనీ రీజినల్ మేనేజర్ ప్రదీప్‌రెడ్డి ఫిర్యాదు మేరకు నాతవరం ఎస్‌ఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసి తక్కువ సమయంలోనే కేసును ఛేదించారన్నారు. ఈ కేసులో నాతవరం మండలం శృంగవరం గ్రామానికి చెందిన కాళ్ల ఆది సత్యనారాయణ, సుర్ల ప్రసాద్, గాజువాక పెదగంట్యాడకు చెందిన గుడె కిరణ్, పల్లేటి అనిల్‌ను అరెస్టు చేశామన్నారు. షాడో ఫ్యాక్స్ లాజిస్టిక్ కంపెనీ ముంబై కేంద్రంగా పని చేస్తోందన్నారు. దీనికి సంబంధించిన ప్రధాన బ్రాంచి గాజువాకలో ఉంది. ఇక్కడ నుండి ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకున్న వస్తువులు విభజించి ఆయా సబ్ బ్రాంచిల ద్వారా బుకింగ్‌దారులకు డెలివరీ చేస్తుంటారు. అరెస్టు చేసిన నలుగురు వ్యక్తులు గాజువాక బ్రాంచిలో పని చేస్తున్నారు. వస్తువులను వేరు చేస్తున్న సమయంలో విలువైన రెండు, మూడు సెల్‌ఫోన్స్ చెత్తతో కలిపి బయట విసిరేసేవారు. తర్వాత వాటిని తీసుకువెళ్లి విక్రయించి సొమ్ము చేసుకునేవారని తెలిపారు. సీసీ కెమెరాలు పని చేయకుండా చేసి ఖరీదైన 50 సెల్‌ఫోన్లు పక్కదారి పట్టించి సొమ్ము చేసుకున్నారని తెలిపారు. అధిక మొత్తంలో కంపెనీకి లాస్ రావడంతో షాడోఫ్యాక్స్ లాజిస్టిక్ కంపెనీ ఇన్వెస్టిగేషన్ టీమ్ దృష్టి సారించిందన్నారు. కంపెనీలో పని చేస్తున్న వ్యక్తులు సీసీ కెమెరాలను ఆఫ్ చేసి సామగ్రిని దొంగిలించినట్లు గుర్తించామన్నారు. అరెస్టు చేసిన ముగ్గురు నిందితుల నుంచి సెల్‌షాపుల్లో విక్రయించిన సెల్‌ఫోన్‌లతో పాటు వారి దగ్గర ఉన్న మొత్తం సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



బంగార్రాజు (ఫైల్)



మృతి చెందిన బంగార్రాజు

కొయ్యూరు/పాయకరావుపేట : జనసేన వీరాభిమాని బాలారంకు చెందిన సంతక బంగార్రాజు (20) కత్తిపూడిలో పవన్ కల్యాణ్ సమావేశానికి వెళ్లి తిరిగి వస్తుండగా తుని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. బంగార్రాజు బుధవారం కత్తిపూడిలో నిర్వహించిన బహిరంగ సభకు వెళ్లి తిరిగి రాత్రి నర్సీపట్నం ద్విచక్ర వాహనంపై వస్తుండగా విశాఖపట్నం వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టింది. దీంతో బంగార్రాజు తలకు తీవ్ర గాయం కాగా అతనిని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కొడుకు మరణించాడన్న సమాచారం తెలుసుకున్న తల్లి నాగరత్నం భోరున విలపించింది ఆ కుటుంబాన్ని జనసేన అధిష్టానం ఆదుకోవాలని గ్రామస్తులు, తల్లి కోరుతున్నారు. కొడుకు మరణంతో తల్లి అనాథగా మారిందని, ఆమె కొడుకుపై ఆధారపడి ఉందని స్థానికులు చెబుతున్నారు. మృతుడి తల్లి నాగరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు పాయకరావుపేట ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

అటవీ వనాల సంరక్షణకు చర్యలు

- రంగురాళ్ల క్వారీలపై నిరంతర నిఘా
- చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణ



చింతపల్లి: పోలీసు, రెవెన్యూ అధికారుల సహకారంలో అడవుల సంరక్షణతోపాటు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేస్తామని చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణ అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. చింతపల్లి డివిజన్ పరిధిలోని సిగనాపల్లి, గుర్రాలగొంది, మేడూరు వంటి రంగురాళ్ల క్వారీల్లో నిరంతర నిఘా కొనసాగిస్తున్నామన్నారు. తమ వద్ద ఉన్న బేస్‌క్యాంపు సిబ్బందిని క్వారీల వద్ద షిఫ్టుల వారీగా కాపలాగా ఉంచుతున్నామని ఆయన వెల్లడించారు. అటవీ ప్రాంతాల్లో అక్రమంగా ఇసుక, రంగురాళ్లు, గంజాయి సాగు వంటి చర్యలకు పాల్పడే వారిపై ఎప్పటికప్పుడు సమాచారం అందేలా వ్యవస్థ ఉందన్నారు. అడవుల సంరక్షణతోపాటు, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్, పాలిథిన్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించేలా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇటీవల ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని నెలరోజుల ముందు నుంచి అటవీ శాఖ ద్వారా అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేశామన్నారు.పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు పలు ప్రాజెక్టులను సిద్ధం చేశామని తెలిపారు. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే తదుపరి చర్యలు చేపడతామన్నారు. అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల సంరక్షణ, అగ్నిప్రమాదాల నివారణ తదితర అంశాలకు ప్రాధాన్యమిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

న్యాయవాదుల బీమా గడువు పెంపు

విశాఖ లీగల్ : న్యాయవాదుల వైద్య బీమా పథకాన్ని ఈనెల 16వ తేదీ నుంచి నెల రోజులపాటు పొడిగించినట్లు రాష్ట్ర బార్ కౌన్సిల్ సీనియర్ సభ్యుడు ఎస్.కృష్ణమోహన్ తెలిపారు. ఇప్పటివరకు వైద్య బీమా పథకంలో సభ్యులుగా చేరని న్యాయవాదులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అలాగే బీమా సౌకర్యం వచ్చే నెల 4వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందన్నారు. మరిన్ని వివరాలకు విశాఖ న్యాయవాదుల సంఘం కార్యాలయం, హైకోర్టు బార్ కౌన్సిల్ కార్యాలయం లేదా తమను వ్యక్తిగతంగా సంప్రదించవచ్చని కృష్ణమోహన్ చెప్పారు. బార్ కౌన్సిల్ వెబ్‌సైట్‌ను https@//barcounciap.orf సందర్శించవచ్చన్నారు.